# పరాభవం

రాత్రి నాన్నగారు అనంతరావును గురించి అమ్మతో మాట్లాడటం ప్రమీల విన్నది. "అనంతరావు యిప్పుడు ఎం. ఏ. చదువు తున్నాడు. బాగా ఆస్తి ఉన్నవాడు. బియ్యే చదువుకున్న మన ప్రమీలను అతని కిచ్చి చేయటంకంటె కోరదగింది లేదు" అన్నారు నాన్న. ఆయన యింకా అనంతరావు గురించి ఏమేమి చెప్పినా ప్రమీల వినలేదు. యిటువంటి ప్రస్తావన యింట్లో వస్తుందని తను అనుకోలేదు; ఇవాళ తనకు తెలిసిన విషయం— తన్ని అనంతరావు కిచ్చి చెయ్యాలని నాన్నగారికి ఉద్దేశం ఉందని. ఈ ఉద్దేశం తనకి ఏవిధమయిన సంతోషాన్నీ కలిగించలేదు. తనకు అనంతరావు తెలియనివాడు కాదు, బి. య్యే అతను తనతోనే చదివాడు.

బి. య్యే రెండవ సంవత్సరంలో ఒక రోజున అనంతరావు ఎవరితోనో కలసి నాన్నగారికోసం వచ్చాడు. నాన్నగారిని పిలిపించిం దవరోనని తాను హాలులోనికి వచ్చేసరికి అనంతం, యింకొక వ్యక్తి ఉండటం చూసి నివ్వెరపోయిన ప్రమీలను "ప్రమీలా! మీ నాన్నగారు ఉన్నారా?" అని అడిగాడు — క్లాసులో ఒక విద్యార్థిగా అనంతరావును ప్రమీల ఎరుగును; తనను ఎంతో తెలిసి ఉన్నట్టు చనవుగా పిలిచిన అతనిమీద ప్రమీలకు అపరిమితమయిన జుగుప్స కలిగింది. మాట మాట్లాడకుండా లోనికి పోయి పనిమనిషి చేత "లేరని" చెప్పించింది. తర్వాత నాన్నగారితో బాటు కోర్టునుంచి వాళ్ళిద్దరూ యింటికి వచ్చారు. తర్వాత ఈ అనంతరావు నాన్నగారితో మాట్లాడేందుకు ఎన్నో సార్లు తమ యింటికి వచ్చేవాడు. అతను వచ్చినప్పుడల్లా ప్రమీల అతనికి కనపడకుండా ఉండేందుకు ప్రయత్నించేది. ఊళ్ళో ఎంతోమంది వకీళ్ళు ఉండగా, అతను సలహాలను గురించి నాన్నగారిదగ్గరకే రావటానికి కారణ మేమిటో ప్రమీల ఊహించింది: క్లాసులో తాను అతని వైపు ఎప్పుడయినా చూసినప్పుడు అతని చూపులు తనమీదనే ఉన్నట్టు ప్రమీల గమనించింది.

ఒకరోజున తనకు వచ్చిన కవరు ఉత్తరం చించి చదవబోయేసరికి పైన ప్రమీలా! అని ఉండగా, ఏ స్నేహితురాలు తనకీ ఉత్తరం వ్రాసిందోనని క్రింది సంతకం చూసేసరికి అనంతరావు సంతకం ఉంది. ఆమె యిది చూసి విస్మయపడిపోయింది. ముఖంలో రక్త రేఖలు కనబడ్డాయి. ఇలాంటి ఉత్తరం తనకు అంతకుముందెప్పుడూ రాలేదు. కాలేజీ విద్యార్థులు ఆడపిల్లలకు ఉత్తరాలు రాయటం, ప్రిన్సిపాలు రిపోర్టులోనికి వెళ్ళటం ప్రమీలకు తెలుసు. తన విషయంలో అలాంటివి జరగలేదు. ఆ ఉత్తరాన్ని చించి పారేయాలనే ప్రయత్నాన్ని, అందులో ఏముందో చదవాలనే విద్వేషపూరిత కౌతుకం విరమింపజేసింది.

ప్రమీలా!

## శ్రీ వై. వి. రావు

ఈ ఉత్తరం రాస్తున్నందుకు క్షమించకోర్తాను. నీతో మాట్లాడాలని ఎన్నో సార్లు ప్రయత్నించిన నాకు ఈ ఉత్తరం రాయక తప్పలేదు. నా మనస్సులోని ఉద్దేశాలు నీకు చెప్పాలని ఎన్నో సార్లు ప్రయత్నించినా, నిన్ను కలుసుకోగలిగే భాగ్యం నాకు లభించలేదు. ఆ వేళ పార్టీతో నేను మొదటిసారిగా మీ యింటికి వచ్చినప్పుడు స్నేహభావాన్ని పురస్కరించుకుని పలకరించినంతమాత్రాన, నువ్వు లోనికి వెళ్ళిపోయి నన్ను కానాలని అవమానించావు. దాన్ని బట్టి నీకు నాపై ఉన్న ద్వేషభావాన్ని గ్రహించాను. అయినా, నా హృదయం నన్ను చూసిన తొలినాళ్ళలో నీకు అంకితమయిపోయింది. అప్పటినుండి నా నేత్రాలు నీ దర్శన భాగ్యంకోసం ఎదురుచూడసాగినవి. నా చెవులు నీ పలుకులకోసం తపిస్తున్నవి. నా హృదయం నీ మీదనే లగ్నమై ఉంటున్నది. భర్తగా, ఎవరికంటెకూడా ఎక్కువగా నిన్ను సుఖపెట్టగల సిరిసంపదలు నాకు ఉన్నవి. నీ అంగీకారం, తప్పకుండా మీ నాన్నగారి అంగీకారం అవుతుందని నాకు తెలుసు. నిన్ను తప్ప యింకెవర్నీ పెళ్ళాడకూడదని నేనేనాడో నిశ్చయించుకున్నాను. ఈ విషయం గురించి నీతో స్వయంగా మాట్లాడే అవకాశం రేపటి సాయంత్రం నాకు కలగజేస్తావని నమ్ముతున్నాను. దీనిని గురించి మీ పెద్దలకు కూడా ఏమీ అభ్యంతరం ఉండబోదని నమ్ముతున్నాను.

నీ
ప్రేమపాత్రుడు,
అనంతరావు.

ఈ పత్రం చూసిన వాళ్ళా నేవటివరకూ స్తబ్ధంగా ఉండిపోయిన ప్రమీల ఒక్కసారిగా ఉత్తరాన్ని ముక్కలుగా చించివేసింది. "ఛీ! ఎంత నీచ మనస్సు" అని అనుకున్నది. కొద్ది క్షణాలలోనే మర్నాటి సాయంత్రం అతను తమ యింటికి వస్తాడన్న విషయం జ్ఞప్తికి తెచ్చుకుని ఏమి చెయ్యాలా — అని ఆలోచించింది. ఈ విషయాన్ని నాన్నగారితో చెప్పి అతణ్ణి తమ యింటికి రాకుండా చెయ్యాలని సించింది. "ఈ ఉత్తరం చించి పారేశానే! నాన్నగారితో ఏమని చెబుతాను!" అనుకున్నది. తానే అతనికి బుద్ధిచెప్పాలని అనిపించింది. ఇంకెప్పుడయినా యిలాంటి ఉత్తరాలు రాస్తే ప్రిన్సిపాలుకు చూపగలనని చెప్పి అతన్ని నాలుగు చివాట్లూ వెయ్యాలని ఊహించుకున్నది. మర్నాడు సాయంత్రం అతను వచ్చాడు. అతడు నావడిలోనికి రావటం ప్రమీల లోపలినుంచి చూసి, "సిగ్గులేని మనిషి" అని చీదరించుకుని దాసీదాన్ని పిలిచి, "ఎవరో వచ్చారు పోయి, యింట్లో ఎవరూ లేరని చెప్పి బయటకు పంపు!" అన్నది. మరో పది నిమిషాలకు దాసీది తిరిగి వచ్చింది.

"ఏమి వెళ్ళాడా?" అన్నది ప్రమీల.

"వెళ్ళాడండి! మీ నాన్నగారు లేరని చెప్పేనండి. ప్రమీల అమ్మగారు లేరా అని అడిగారండి."

"ఊఁ."

"అమ్మాయిగారితో మీకేం పని అని అడిగానండి. మాట్లాడేపని ఉందన్నారు. మీకు లేరని చెప్పేను" అన్నది దాసీది చేతులు ఊపుతూ.

"అంతటితో పోయాడా?"

దాసీది బుర్ర అడ్డంగా తిప్పి, "లేదండి. ఎక్కడికి వెళ్ళారని అడిగారండి. నాకు తెలియదు బాబూ యింకా కాలేజీనుండి రాలేదన్నానండి. కాస్సేపు ఆలోచించి వెళ్ళిపోయారండి —"

"పీడ వదలింది" అనుకున్నది ప్రమీల.

★

ఈ విధంగా నాటికి మనస్సులో నాటుకుపోయిన ప్రమీల, మర్నాడు క్లాసులో అనంతరావు వైపు చూడటం మానేసింది. తన వైపు దీనంగా చూస్తున్న అతని



ప్రమీల ఒక్కసారిగా ఉత్తరాన్ని చించివేసింది

వయిపు, "ఈ సారి క్షమించానులే" అన్నట్లు చూసింది. అనంతరావు తర్వాత యిలా ఉత్తరం రాయలేదు. అతను తర్వాత నాన్నగారికోసం అప్పుడప్పుడు వచ్చినప్పుడు హాలులో నాన్నగారితో మాట్లాడుతూ ఉండగా, అతని చూపులు "తన" కోసం వెదుకుతున్నట్లు ప్రమీల చాలా సార్లు చూసింది. ప్రమీలకు అనంతరావు ఎటువంటి మనిషో అర్థం కాలేదు. ఇలాంటివాళ్లు ఉంటారనికూడా తను అనుకోలేదు. బోలెడు సాహిత్యం చదివినా, యిలాంటి పాత్ర తనకు ఎక్కడా తటస్థపడలేదు. అర్థంచేసుకు నేందుకయినా. రాను రాను అతనిమీద కోపమంతా ఆ పైన జాలిగా మారిపోయింది. బి. యే యిలా గడిచిపోయింది.

★

వేసవి కాలపు సాయంత్రపు వేళ ప్రమీలా శారదా, సునందా సముద్రతీరాన కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. శారద దూరాన ఎవరినో చూసి, "అడుగో! అనంతం యింకా ఊళ్ళోనే ఉన్నాడే!" అన్నది.

సునందా, ప్రమీలా అప్రయత్నంగా దిక్కున వెనక్కి తిరిగి చూశారు. అనంతరావు అల్లంత దూరాన ఎవరితోనో మాట్లాడుతూ పోతున్నాడు.

"ప్రక్కాయన వాళ్ళ నాన్నగారు బహుశా ఏ పెళ్ళిసంబంధం గురించో వివ్వ చెప్పటానికి వచ్చి ఉంటాడు" అన్నది శారద.

ప్రమీల అప్రతియ్నంగా శారద వంక చూసింది.

"ఏం! పెళ్ళిచేసుకో నంటున్నాడేం?" అన్నది సునంద.

"అవునట! తన పెళ్ళి విషయంలో పెద్దవాళ్ళు కలగజేసుకోవద్దని చెప్పాడట. వాళ్ళ నాన్న కట్నం పోగొట్టుకోవటానికి ఇష్టపడక ఏదో సంబంధం ముడిపెట్టెయ్యాలని చూస్తున్నారు. అతనికి చాలా సంబంధాలు వస్తున్నాయట కూడా" అన్నది శారద రిపోర్టు చదివినట్టు.

"అవునే! నీ కెలా తెలుసు యిదంతా?" అన్నది సునంద.

ఈ ప్రశ్న అడిగినందుకు ప్రమీల మనస్సులో సునందను అభినందించుకుంది. తనకూ యిదే సందేహం!

శారద నవ్వింది. అన్నది: "అతనిది మా పిన్నిగారి ఊరేగా! వాళ్ళిల్లు మా పిన్నిగారింటి పక్కనే కూడా! వాళ్ళ నాన్నకంటె డబ్బున్నవాడు ఆ ఊళ్ళో లేడు. మొన్న మా పిన్నిగారింట ఓ వారం రోజులపాటు ఉన్నానుగా. అక్కడ చెప్పుకున్నా రితని సంగతి."

సంభాషణ యింతకు దూరం పోలేదు. శారద యింకా అనంతరావుగురించి చెబుతుందేమోనని ప్రమీల ఎదురుచూసింది. కాని శారద సంభాషణ మార్చివేసింది. ఆ వేళ రాత్రి ప్రమీల అనంతరావుగురించే ఆలోచించింది. అతను నిజంగా తనగురించే యింత పట్టుదలగా ఉన్నాడా? తన హృదయాన్ని తనకే అంకితం చేశానని తనకు రాశాడు. ఆ మాటలు తనకు జ్ఞాపకం ఉన్నది. తాను అతన్ని ప్రేమించగలదా? తనకూ, అతనికీ వివాహమే సంభవమయితే తన జీవితం ఎలా ఉంటుంది? అనేక రకాల ఆలోచనలు హృదయాకాశంలో విహరించి అంతరించాయి.

రిజల్ట్సు వచ్చాయి. ప్రమీల పాసయింది. బి. ఏ. అయింతర్వాత తను యింట్లోనే ఉంటున్నది. అనంతరావుగురించి తాను వినలేదు. రాత్రి నాన్నగారు చెబుతుండగా విన్నది— అతను ఎం. ఏ చదువుతున్నాడని. నాన్నగారికి తనను అతనికే యిచ్చి చేయాలని పట్టుదలగా వుంది. తను అంగీకరించేట్టయితే అనంతరావు వాంఛ కూడా ఈడేరినది కాగలదు. అతను



# ప్రభాతం

ఫోటో : శ్రీ నిప్పాణి గిరిధరరావు

తననువాంఛించాడు తనకోసం తపించాడు. తనను అంతదూరాన ఉంచినా అతడు తనకోసమే ఎదురుచూశాడు. ఎప్పుడూ తా నతన్ని ద్వేషించింది. తనతో మాట్లాడేందుకు అతనికి అవకాశం యివ్వనే లేదు—నాన్నగారు సంబంధం మాట్లాడేందుకు వాళ్ళింటికి వెళ్తున్నారు. ఆయన వెళ్ళివట్టయితే సంబంధం నిశ్చయమయినట్లే. అనంతం చాలా సంతోషంతో అంగీకరిస్తాడు. తన కల నిజమయిపోవటం నమ్మలేకపోతాడు. అయితే తాను? తా నతణ్ణి ప్రేమించగలదా! తన యిష్టాయిష్టాలు నాన్నగారి దగ్గర వెల్లడి చేయకపోతే—జీవితంలో తన కిష్టంలేని బంధనంలో తాను చిక్కుపడిపోతుంది. ఆలోచనతో గడిపి యిలా ఏ విషయమూ తేల్చుకోలేకపోయిన ప్రమీల వాళ్ళ నాన్నగారు అనంతరావు సంబంధం మాట్లాడేందుకు వెళ్ళేటప్పుడు కూడా ఏమీ చెప్పలేకపోయింది.

నాన్నగారు ఆ వేళ సాయంత్రమే వచ్చారు. అమ్మ "ఏమయిం"దని అడగటంతోనే పెద్దగా నిట్టూర్చిన తండ్రిని చూసి, "ఏమయిందో"నని తనుకూడా కుతూహలం కనిపించింది.

"ఏమయింది?"

"అబ్బాయి లేడూ?" అమ్మ అడిగింది.

"లేకేం! ఉన్నాడు. ఎన్నో సంబంధాలు కాదన్న కుర్రాడికి మన సంబంధం చేసుకుంటే బాఫుంటుందని తండ్రి ఉబలాటపడ్డాడు. కాని కుర్రాడు తాను పెళ్ళిచేసుకోనని పట్టుపట్టి కూర్చున్నాడు" అన్నారు నాన్న.

చాలా అయిష్టమైన సంగతి వింటే మనస్సు ఎంత బాధపడుతుందో ప్రమీల అంతగా బాధపడింది. నాన్న అన్నారు: "నేను అనంతానికి చెప్పాను. ప్రమీలను చూశావుగదా. అన్ని లాంఛనాలూ మీ యిష్టప్రకారం జరుపగలను. అని కూడా చెప్పాను. అతను ససేమిరా వినలేదు. తనకు వివాహేచ్ఛ లేదనీ, జీవితమంతా బ్రహ్మచర్యంలోనే గడపాలని నిశ్చయించుకున్నాననీ, పెళ్ళిగురించి తనకేమీ చెప్పవద్దని అర్థించాడు. ఏం చెప్పనింక?" అన్నారు నాన్న.

"అయితే, యింకో సంబంధమేదయినా చూడాలన్న మాట" అన్నది అమ్మ.

సంధ్యచీకటిలో గుమ్మం మాటున నిలబడి వింటున్న ప్రమీల నేత్రాలు ఎందు చేతనో ద్రవీభవించి పోయినవి. ఇప్పుడామె మనస్సులో తాను చిరకాలంగా ద్వేషించిన అనంతరావుమూర్తి ప్రకాశిస్తున్నది. అతన్ని తాను ఎందుకు ద్వేషించింది? అతడు తనమీద ప్రతీకారం సాధించాడా? నిజంగా అతను తనను చేసుకుంటాననివుంటే తాను సంతోషపడేది కాదు. కాని అతను తనను తిరస్కరించినందుకు తనకు తీరని బాధకలిగింది—ఈ బాధను దాచుకునే శక్తి తనలో లేదు. హృదయం ద్రవీభవించి వేడి కన్నీటి ప్రవాహం చెక్కిళ్ళు తడుపుతున్నది. మోక్షం అందుకోలేని మహాపాపి పడే వేదన తాను పడుతున్నది. అనంతరావు ప్రేమ ఎంతటిదో తనకు యిన్నాళ్ళ తెలిసింది. అతని జీవితంలోని నమ్మకాలను తన వైరభావం తుడిచిపెట్టింది. తన జీవితంలోని మార్పులకు కారణభూతురాలయిన ఒక మహాపాపి ఈ లోకంలో జీవిస్తూ ఉన్నదని అతడు ఎప్పుడూ తలపోస్తూ ఉంటాడు. ఆమె బలంగా కళ్ళు మూసుకున్నది. వేడి కన్నీటి చుక్కలు బరువుగా క్రింద రాలాయి. ★